క్లుప్తంగా

ప్రపంచ ఆర్యవైశ్య సంఘంలో కొయ్యలగూడెం సభ్యులు


కంభంపాటి సాయికృష్ణ   సాలస సుధాకర్

కొయ్యలగూడెం: ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ యువజన విభాగం అసోసియేషన్‌లో కొయ్యలగూడెంకు చెందిన ఇద్దరికి చోటు లభించింది. ఉపాధ్యక్షుడిగా కంభంపాటి సాయికృష్ణ, సహాయ కార్యదర్శిగా సాలస సుధాకర్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు కోన శ్రీనివాసరావు నియామక ఉత్తర్వులను విడుదల చేసినట్టు వారు తెలిపారు. ఆర్య వైశ్యుల్లో పేద విద్యార్థులను గుర్తించి వారికి ఉన్నతమైన విద్య అందించేందుకు తమ వంతు కృషి చేస్తామని పేర్కొన్నారు. వీరిని ఆర్య వైశ్య సంఘాలు, వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ కమిటీ అభినందించాయి.

లోవోల్టేజ్ సమస్య పరిష్కారం


ట్రాన్స్‌ఫార్మర్‌ను చూపుతున్న వైస్‌చైర్మన్ అంజి

జంగారెడ్డిగూడెం: స్థానిక 7, 8, 9 వార్డు ప్రజలు సుదీర్ఘ కాలంగా ఎదుర్కొంటున్న లో ఓల్టేజ్, అధిక లోడు సమస్య పరిష్కారమయినట్టు మున్సిపల్ వైస్ చైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు (అంజి) తెలిపారు. శుక్రవారం విద్యుత్ శాఖ అధికారులు స్థానిక 8వ వార్డులో 100 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. వేసవిలో నిత్యం లో ఓల్టేజ్ సమస్యలు ఎదుర్కోవాల్సి వచ్చిందన్నారు. దీంతో విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయించినట్టు చెప్పారు. ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు కోసం తన సొంత ఖర్చులతో సిమెంట్ దిమ్మెను నిర్మించానని అంజి తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ మంజూరుకు సహకరించిన ఎంపీ కోటగిరి శ్రీధర్ బాబు, ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా, విద్యుత్ శాఖ అధికారులకు అంజి కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నట్టు చెప్పారు.

సుబ్బారాయుడికి లక్ష బిల్వార్చన


లక్ష బిల్వార్చన పూజలు అందుకున్న శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

కొయ్యలగూడెం: ఏజెన్సీ మెట్ట ప్రాంతంలో ప్రముఖ క్షేత్రంగా భాసిల్లుతున్న బయ్యన్నగూడెం వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో లక్ష బిల్వార్చన పూజలు 13వ తేదీ తెల్లవారుజాము నుంచి సుమారు 18 గంటలపాటు ధర్మకర్త బాలం దత్తుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. మారేడు దళాలను దేవేరులతో సహా స్వామి మూలవిరాట్ విగ్రహాలకు అభిషేకిస్తూ పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు తిమ్మాపురంలో జగనన్న సురక్ష

ద్వారకాతిరుమల: తిమ్మాపురం సచివాలయం వద్ద శనివారం ఉదయం 11 గంటల నుంచి అమ్మఒడి, జగనన్న సురక్ష కార్యక్రమాలను నిర్వహిస్తామని ఎంపీడీఓ ఏవీ సుబ్బరాయన్ తెలిపారు. కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, ఎమ్మెల్యే తలారి వెంకట్రావు పాల్గొంటారని పేర్కొన్నారు. లబ్ధిదారులు, ప్రజా ప్రతినిధులు, పార్టీ శ్రేణులు హాజరుకావాలని ఆయన కోరారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న అధ్యక్షుడు నర్సింహారావు

జంగారెడ్డిగూడెం రూరల్: నాయీ బ్రాహ్మణులందరూ ఐక్యతగా ఉండాలని చింతలపూడి నాయీ బ్రాహ్మణ సేవా సంఘ అధ్యక్షుడు చిప్పాడ నరసింహారావు అన్నారు. లక్కవరంలో శుక్రవారం నిర్వహించిన నాయీ బ్రాహ్మణ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. నాయీ బ్రాహ్మణులకు ప్రభుత్వం గుర్తించి కుల దూషణకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకునేలా జీఓ, దేవలయ పాలకవర్గంలో డైరెక్టర్ల పదవులు, బార్బర్ షాపులకు 150 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇలా అనేక పథకాలను అమలు చేస్తోందని చెప్పారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని నరసింహారావు సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సేవా సంఘం ప్రధాన కార్యదర్శి కొప్పిర్ల నాగరాజు, ఏలూరు జిల్లా అధ్యక్షుడు కొప్పాక వెంకటేశ్వరరావు, రాష్ట్ర సెక్రెటరీ కొప్పాక సత్యనారాయణ, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు అయినపర్తి ఉషారాణి, లక్కవరం గ్రామం నాయీ బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు నూజేటి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ లబ్ధి చేకూర్చడమే లక్ష్యం


యర్రగుంటపల్లిలో మొక్క నాటుతున్న ఎమ్మెల్యే ఎలీజా


అలివేరులో సర్టిఫికెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే బాలరాజు


జాజులకుంటలో ధ్రువ పత్రం అందిస్తున్న ఎమ్మెల్యే తలారి

ధ్రువ పత్రాల పంపిణీ

చింతలపూడి: సంక్షేమ పథకాలు అందని అర్హులందరికీ లబ్ధి చేకూర్చడమే జగనన్న సురక్ష ముఖ్య ఉద్దేశమని ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. చింతలపూడి మండలం యర్రగుంటపల్లి పంచాయతీలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎలీజా సురక్ష కార్యక్రమాన్ని పర్యవేక్షించి గ్రామంలో మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ ఇళ్ల వద్ద, ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటాలని సూచించారు. ప్రభుత్వం పారదర్శకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అర్హులందరికీ అవసరమైన ధ్రువ పత్రాలను ఉచితంగా అందజేస్తున్నట్టు తహసీల్దార్ కృష్ణ జ్యోతి తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ రాంబాబు నాయక్, మండల సచివాలయాల కన్వీనర్ త్సల్లాబత్తుల శ్రీనివాసరావు, సర్పంచ్ తుల్లిమెల్లి రాణి, వైస్ ఎంపీపీ ఎస్ వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష విశేష స్పందన

బుట్టాయగూడెం: అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోందని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. బుట్టాయగూడెం మండలం మారుమూల గ్రామమైన అలివేరులో జగనన్న సురక్ష క్యాంప్ నిర్వహించారు. అర్హులకు బాలరాజు ధ్రువ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయాల పరిధిలో ప్రజల నుంచి అందిన వినతులకు పరిష్కార మార్గం చూపిస్తామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మొడియం రామతులసి, ఎంపీపీ కారం శాంతి, సర్పంచ్‌లు కారం లక్ష్మి, ఎంపీటీసీ కొవ్వాసి గోవిందరాజు, నాయకులు ఆరేటి సత్యనారాయణ, కొక్కెర భీమరాజు, మండకం గంగరాజు, కారం వాసు, సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే సంక్షేమ ఫలాలు

ద్వారకాతిరుమల: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు అప్పటికప్పుడే 11 రకాల సేవలు అందిస్తున్నట్టు గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. ద్వారకాతిరుమల మండలం జాజులకుంట గ్రామంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. లబ్ధిదారులకు పలు ధ్రువ పత్రాలను అందజేశారు. టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీలు చెప్పిన వారికే సంక్షేమ పథకాలు దక్కేవని, అవి కూడా టీడీపీ నాయకులకు, కార్యకర్తలకు మాత్రమే అందేవని ఆరోపించారు. నేడు జగనన్న పాలనలో కుల, మత, పార్టీలకు అతీతంగా అర్హులందరికీ పథకాల లబ్ధి అందుతోందని చెప్పారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెలికాని రాజబాబు, జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, సర్పంచ్ బత్తుల బేబిశ్యాంతి, ఎంపీటీసీ వసంతాటి లక్ష్మి, పార్టీ గ్రామకమిటీ అధ్యక్షుడు బలుమూరి మురళీమోహన్, బత్తుల విజయశేఖర్, దొప్పసాని రాంబాబు, చిలుకూరి రాధాకృష్ణ, ముమ్మిడి సత్యనారాయణ, మండల సచివాలయాల కన్వీనర్ భోగరాజు సాయికృష్ణ, సొసైటీ చైర్మన్లు భోగరాజు చిన్ని, గుర్రాల లక్ష్మణ్, బొండాడ వెంకన్నబాబు, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ బాషా, జేవీ కృష్ణారెడ్డి, మానుకొండ సుబ్బారావు తదితరులున్నారు.

మండలంలో జగనన్న సురక్ష కార్యక్రమాలు

జంగారెడ్డిగూడెం రూరల్: జంగారెడ్డిగూడెం మండలం మైసన్నగూడెం, పేరంపేట గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమాలు నిర్వహించారు. అర్హులకు ధ్రువ పత్రాలను అందజేశారు. జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి మాట్లాడుతూ అర్హులైన ప్రతీ ఒక్కరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందిస్తోందన్నారు. ఎంపీపీ కొదమ జ్యోతి మాట్లాడుతూ సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పాలన చేస్తుందని, పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సర్పంచ్ సింగుదాసు హైమావతి, కంకిపాటి కుమారి, ఎంపీటీసీలు ఇర్ల విజయశాంతి, నూనె శ్యామల, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు వామిశెట్టి హరిబాబు, సచివాలయాల మండల కన్వీనర్ గురజాల పార్థశారధి, కోఆప్షన్ సభ్యులు లాల్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలకు తక్షణ పరిష్కారం

కామవరపుకోట: ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించడానికే జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు జెడ్పీటీసీ కడిమి రమేష్ అన్నారు. కామవరపుకోట మండలం కళ్లచెరువు, పోలసీగూడెం గ్రామాల్లో నిర్వహించిన జగనన్న సురక్ష సభల్లో లబ్ధిదారులకు ధ్రువ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మిడతా రమేష్, సర్పంచ్ నౌడు శ్రీదేవి సత్తిబాబు, పోలసీగూడెం ఉప సర్పంచ్ రవి, ఎంపీటీసీ వెల్లంకి మనోరమ వాసు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష పేదలకు వరం

లింగపాలెం: జగనన్న సురక్ష ప్రజలకు వరమని చింతలపూడి ఏఎంసీ మాజీ చైర్మన్ మందలపు సాయిబాబు అన్నారు. కలరాయనగూడెం సచివాలయం వద్ద నిర్వహించిన జగనన్న సురక్ష సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. అర్హులకు సర్పంచ్ చలగుళ్ల రవిబాబు, మండల ప్రత్యేకాధికారి ఏవీ ఆర్ గంగాధరబాబు, అధికారులతో కలిసి ధ్రువ పత్రాలను సాయిబాబు అందజేశారు. మొక్కలు నాటారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మట్టా సురేష్, ఎంపీటీసీ సీహెచ్ శివాజీ, నాయకులు మందలపు నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

కన్నాపురంలో..

కొయ్యలగూడెం: మండలంలోని కన్నాపురం గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం ఎంపీడీఓ ఆర్ బేబీ శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. అర్జీదారులకు వివిధ పథకాలు, భూ సంబంధిత సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. సర్పంచ్ ఉప్పల పద్మావతి, నాయకులు కొండపల్లి శివాజీ, వుప్పల కృష్ణ కాటుబోయిన సురేష్, ఎండీ షాబాజ్, సొంగ రాకేష్, ఎండీ చినహాజీ తదితరులు పాల్గొన్నారు.

ఆఖరి అర్హునికీ లబ్ధి

టి.నరసాపురం: చివరి లబ్ధిదారుని వరకు సంక్షేమ పథకాలు అందేందుకు జగనన్న సురక్ష కార్యక్రమం ఉపయోగపడుతుందని జెడ్పీటీసీ సామంతపూడి బాలసూర్యనారాయణరాజు అన్నారు. టి.నరసాపురంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సచివాలయం వద్ద మొక్కలు నాటారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ శ్రీను రాజు, రైతు విభాగం జిల్లా అధ్యక్షులు, సొసైటీ చైర్మన్ వాసిరెడ్డి మధు, దేవరపల్లి ముత్తయ్య, సర్పంచ్ మోదుగు సునంద, ఎంపీటీసీలు నార్లపాటి వెంకట్రావు, అర్జా బాలయ్య, మండల యూత్ అధ్యక్షులు కన్నం సర్వేశ్వరరావు పాల్గొన్నారు.

పట్టిసంలో..

పోలవరం రూరల్: జగనన్న సురక్ష ద్వారా అర్హులందరికీ లబ్ధి చేకూరుతోందని ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి అన్నారు. పోలవరం మండలం పట్టిసం గ్రామ సచివాలయం వద్ద సర్పంచ్ ఎస్.శ్రీరామమూర్తి అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. లబ్ధిదారులకు ధ్రువ పత్రాలు, రేషన్‌కార్డులు అందజేశారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఐటీడీఏ పీఓ జీవీవీ సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బుగ్గా మురళీకృష్ణ, జెడ్పీటీసీ కలుం హేమకుమారి, ఎంపీటీసీ ఆకుల వరలక్ష్మి, సొసైటీ అధ్యక్షుడు పాదం రాజబాబు, తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

ఎమ్మెల్యే తెల్లం బాలరాజు


అలివేరులో బ్రోచర్ అందిస్తున్న ఎమ్మెల్యే బాలరాజు


సీతానగరంలో బ్రోచర్ అందిస్తున్న ఎమ్మెల్యే ఎలీజా

బుట్టాయగూడెం: గిరిజనుల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశేష కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. బుట్టాయగూడెం మండలం మారుమూల అటవీ ప్రాంతం అలివేరు సచివాలయ పరిధిలో ఉన్న కొండరెడ్డి గ్రామంలో శుక్రవారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. సీఎం జగన్ పాలనలో గిరిజనులందరికీ సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయని చెప్పారు. ప్రతి గ్రామంలోనూ ఒక్కో కుటుంబానికీ రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు లబ్ధి చేకూరిందని వివరించారు. గిరిజనులు సాగు చేసుకుంటున్న పోడు భూములకు నాడు దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి సుమారు 4,500 వరకు పట్టాలిచ్చారని గుర్తుచేశారు. వైఎస్సార్ బాటలోనే సీఎం జగన్ కూడా సుమారు 3,500 మందికి పైగా పోడు భూములకు పట్టాలు ఇచ్చారని వివరించారు. వైఎస్సార్ మరణం తర్వాత ఏర్పడిన ప్రభుత్వాలు గిరిజనుల సంక్షేమాన్ని పూర్తి నిర్లక్ష్యానికి గురి చేశాయని ఆరోపించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మొడియం రామతులసి, ఎంపీపీ కారం శాంతి, వైస్ ఎంపీపీలు కుక్కల వరలక్ష్మి, గగ్గులోతు మోహన్‌రావు, అలివేరు సర్పంచ్‌లు కారం లక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడు కొవ్వాసి గోవిందరాజు, పార్టీ నాయకులు ఆరేటి సత్యనారాయణ, కొక్కెర భీమరాజు, మండకం గంగరాజు, కారం వాసు, సోమరాజు, ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి, ఎస్సై వెంకన్న పాల్గొన్నారు.

ప్రగతి, పేదరిక నిర్మూలనే లక్ష్యం

చింతలపూడి: రాష్ట్ర ప్రగతి, పేదరిక నిర్మూలన ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారని ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. సీతానగరం పంచాయతీలో శుక్రవారం ఆయన ఎంపీటీసీ కలకొండ రామారావు ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరిస్తూ.. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సీసీ రోడ్లు, డ్రెయినేజీ నిర్మాంచాలని, అర్హులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని పలువురు కోరారు. వీటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే ఎలీజా హామీ ఇచ్చారు. గడపగడపకు మన ప్రభుత్వం ద్వారా ప్రజలను కలుసుకునే అవకాశం కల్పించిన సీఎం జగన్‌కు ఎలీజా కతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.రాంబాబు నాయక్, జెడ్పీటీసీ ఎం.నీరజా సుధాకర్, సర్పంచ్ గాయం మల్లేశ్వరి, ఉన్నమట్ల ఝాన్సీరాణి, మండల పరిషత్ చీఫ్‌విప్ కె.రామారావు, సర్పంచ్‌లు తాండ్ర రామకష్ణ, యడ్ల మోహన్‌రావు, సొసైటీ అధ్యక్షుడు అలవాల బాబు, పార్టీ నాయకులు కొప్పుల నాగేశ్వరరావు, త్సల్లాబత్తుల శ్రీనివాసరావు, ఎం.దిలీప్, ఎస్ దుర్గారావు, గుత్తా కిషోర్, ఎస్ వరలక్ష్మి, బింకట లక్ష్మి, జంగా చెన్నకేశవరెడ్డి, రాంకుశం వెంకటేశ్వరరావు, చిన్న కుటుంబరావు, జైపాల్ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలు, హాస్టళ్ల తనిఖీ


బాలుర గురుకుల పాఠశాలను తనిఖీ చేస్తున్న జెడ్పీ సీఈఓ రవికుమార్


ఎస్టీ హాస్టల్‌లో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఐఏఎస్ అపూర్వ భరత్

చింతలపూడి: బుట్టాయిగూడెం మండలం పులిరామన్నగూడెం ఆశ్రమ పాఠశాలలో బాలుడి హత్య ఉదంతం నేపథ్యంలో జిల్లా, స్థానిక అధికారులు శుక్రవారం ఆశ్రమ గురుకుల పాఠశాలలు, విద్యార్థుల వసతి గృహాలను ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. స్థానిక ఎస్టీ హాస్టల్‌ను ఐఏఎస్ అపూర్వ భరత్ తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థుల మధ్య శాంతియుత వాతావరణం ఉండేలా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ కృష్ణ జ్యోతి ఉన్నారు.

- సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలను జెడ్పీ సీఈఓ రవికుమార్ సందర్శించారు. విద్యార్థులకు అందుతోన్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. తోటి విద్యార్థులతో సోదర భావంతో కలిసిమెలిసి ఉండాలని విద్యార్థులకు సూచించారు. ప్రభుత్వ సౌకర్యాలను వినియోగించుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట మండల పరిషత్ కార్యాలయ అధికారులు ఉన్నారు.
- ఎంపీడీఓ మురళీకృష్ణ యర్రగుంటపల్లి బీసీ బాలుర వసతి గృహాన్ని సందర్శించారు. మరుగుదొడ్లు, డార్మెట్రీ రూములను పరిశీలించారు. హాస్టల్‌లో విద్యార్థుల కోసం తయారుచేసిన ఆహారాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని ఆదేశించారు.

పి.అంకంపాలెంలో భూవివాదం

బుట్టాయగూడెం(జీలుగుమిల్లి): జీలుగుమిల్లి మండలం పి. అంకంపాలెంలో శుక్రవారం భూవివాదం తలెత్తింది. ఆర్‌అండ్‌ఆర్ నిర్వాసితులు, స్థానిక గిరిజనుల మధ్య వివాదం ఏర్పడింది. గ్రామ సమీపంలో పోలవరం నిర్వాసితులు 60 కుటుంబాలకు 2020లో సుమారు 200 ఎకరాల భూమిని భూమికి భూమిగా అధికారులు కేటాయించారు. అయితే ఆ భూమిని నిర్వాసితులు దున్నే ప్రయత్నం చేయగా స్థానిక గిరిజనులు అడ్డుపడ్డారు. దీంతో వాగ్వివాదం జరిగింది. సమాచారం అందుకున్న రెవెన్యూ, పోలీస్ శాఖ అధికారులు అక్కడికి చేరుకుని వారికి నచ్చజెప్పి పంపించివేశారు. వివాదం సర్దుమనిగింది.

శాకంబరి అలంకరణలో అమ్మవార్ల దర్శనం


శాకంబరిగా కనకదుర్గమ్మ


ముత్యాలమ్మను దర్శించుకున్న భక్తులు

జంగారెడ్డిగూడెం: ఆషాడమాసం శుక్రవారం సందర్భంగా అమ్మవార్లు శాకంబరి అలంకరణల్లో భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత ఆలయంలో అమ్మవార్లకు నిత్య కైంకర్యాలు నిర్వహించారు. జంగారెడ్డిగూడెం హైస్కూల్ వద్ద ఉన్న కనకదుర్గమ్మవారిని చిట్లూరి వీరభద్రరావు, స్వాతి దంపతుల సహకారంతో వివిధ రకాల కూరగాయలు, పండ్లతో అలంకరించి పూజలు చేశారు. ఏడేళ్లుగా చిట్లూరి వీరభద్రరావు, స్వాతి దంపతులు అమ్మవారికి అలంకరణ సేవ చేస్తున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మున్సిపల్ కార్యాలయం వద్ద శ్రీచక్ర సహిత ముత్యాలమ్మవారిని శాకంబరిగా అలంకరించి, ఉత్సవం నిర్వహించారు. అలంకరణ దాతలకు, ముత్యాలమ్మ వనిత శక్తి బృందానికి ఆలయ నిర్మాణకర్త బవిరిశెట్టి మురళీకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారు.

ఆలయానికి రూ 25,116 విరాళం

జంగారెడ్డిగూడెం నూకాలమ్మ ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అభివృద్ధికి ఇనగడపు అప్పారావు జ్ఞాపకార్థం కుమారుడు వీర రామాంజనేయులు, లక్ష్మీకృష్ణ కుటుంబ సభ్యులు రూ. 25,116 విరాళంగా అందజేశారని ఆలయ కమిటీ చైర్మన్ డాక్టర్ రాజాన సత్యనారాయణ తెలిపారు.

25న బీకేఎంయూ జిల్లా మహాసభ

ఏలూరు (టూటౌన్): ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం (బీకేఎంయూ) ఏలూరు జిల్లా ప్రథమ మహాసభ ఈ నెల 25న జంగారెడ్డిగూడెంలో నిర్వహించనున్నట్టు ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు తెలిపారు. ఉదయం 10 గంటలకు పేదలు, వ్యవసాయ కార్మికులతో ప్రదర్శన, 11 గంటలకు ఆలపాటి గంగాభవాని కల్యాణ మండపంలో మహాసభ నిర్వహిస్తామని పేర్కొన్నారు. మహాసభకు ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జల్లి విల్సన్, ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ ముఖ్య అతిథులుగా హాజరవుతారని వివరించారు. మహాసభను విజయవంతం చేయాలని కోరారు.

వలంటీర్ సేవలు భేష్





జంగారెడ్డిగూడెం: నాపేరు ఉందుర్తి నాగమణి. నేను గృహిణిని. వలంటీర్ సేవలు భేష్. ప్రభుత్వం అందిస్తున్న ప్రతి సేవా ఇంటికే వచ్చి చేరుతోంది. ప్రభుత్వం ఏ పథకం ప్రవేశపెట్టినా గతంలో తెలుసుకోవాలంటే చాలా ప్రయాసలు పడాల్సి వచ్చేది. కొన్ని సమయాల్లో ఆ పథకాల గురించి తెలుసుకునే లోపే వాటి గడువు ముగిసేది. వలంటీర్ వ్యవస్థ ద్వారా ఆ సమస్య లేదు. ఏ పథకం వచ్చినా వాటి గురించి మా వలంటీర్ తాటికొండ దుర్గాప్రసాద్ ఎప్పటికప్పుడు సమచారం ఇస్తున్నారు. కరోనా సమయంలో వలంటీర్‌లు అందించిన సేవలు ఎనలేనివి. ఇటువంటి వ్యవస్థను రూపొందించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు. వలంటీర్ వ్యవస్థపై ఎవరు ఎన్ని రకాలు విమర్శించినా, దాని ఉన్నతిని ఎవరూ తగ్గించలేరు.

ఆస్పత్రిలో ఉంటే పింఛన్ ఇచ్చిన వలంటీర్


ఆస్పత్రిలో కన్నయ్యకు పింఛన్ సొమ్ము అందిస్తున్న వలంటీర్ రేవతి

జంగారెడ్డిగూడెం రూరల్: నాపేరు తానంకి కన్నయ్య, మాది జంగారెడ్డిగూడెం మండలం ఎ.పోలవరం గ్రామం. ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో అనారోగ్యానికి గురై ఏలూరు ఆసుపత్రిలో చికిత్స పొందాను. నేను ఏటూ కదలేని పరిస్థితి నెలకొంది. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నాకు పింఛన్ నగదు గ్రామ వలంటీర్ కట్టా రేవతి అందజేశారు. పింఛన్ పొందిన రోజు నాకు చాలా ఆనందం కలిగింది. వలంటీర్ వ్యవస్థ ఎంతో సేవా దృక్పథంతో పనిచేస్తుందనడానికి నా ఘటనే నిదర్శనం. వలంటీర్లపై పవన్ కళ్యాణ్ విమర్శలు చేయడం బాధాకరం.

వలంటీర్‌కు రుణపడి ఉంటా


హస్పటల్‌లో నాగేశ్వరావుకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ సుమతి

లింగపాలెం: నా పేరు దొడ్డిగర్ల నాగేశ్వరరావు. మాది లింగపాలెం మండల అన్నపనేనివారిగూడెం గ్రామం. నేను ఇటీవల పడిపోవడంతో కాలికి తీవ్ర గాయమైంది. ఏలూరు హస్పటల్‌లో చేరారు. దీంతో పింఛన్ అందదేమో అని అనుకున్నాను. కానీ వలంటీర్ నక్కా సుమతి సేవా భావంతో సొంత ఖర్చులతో 55 కిలో మీటర్ల దూరం ఏలూరు వచ్చి చికిత్స పొందుతున్న నాకు పింఛన్ అందజేసింది. వలంటీర్ల వల్లే నాలాంటి వారికి మేలు జరుగుతుంది. దేవుళ్ల వంటి వలంటీర్లను గౌరవించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది.

మానవత కార్యవర్గ ప్రమాణ స్వీకారం


బాధ్యతలు స్వీకరించిన మానవత మండల సభ్యులు

కొయ్యలగూడెం: కొయ్యలగూడెం మానవత శాఖ 2023 – 24 కమిటీ ప్రమాణ స్వీకారం స్థానిక ప్రకాశం డిగ్రీ కాలేజీలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అధ్యక్షుడిగా బొమ్మ మోహనరావు, సెక్రెటరీగా తిర్నాతి సిద్ధార్థ, ట్రెజరర్‌గా దిద్దే ఎబినేజర్, వైస్ ప్రెసిడెంట్‌గా ఓబిలిశెట్టి నాగేశ్వరరావు డైరెక్టర్స్‌గా మండపాటి రామకృష్ణ, బూసి త్రిమూర్తులతో జిల్లా అధ్యక్షుడు గంగాధర్ ప్రమాణస్వీకారం చేయించారు. సేవలను విస్తరించాలని సూచించారు. తొలుత గతేడాది జరిగిన సేవా కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో కన్వీనర్ త్రిపుర రమేష్, జిల్లా సభ్యుడు సూర్య నారాయణ, వీఎస్ఎన్ స్వామి, వి.జనార్దన్, కేంద్ర రైల్వే బోర్డు మెంబెర్ నిర్మల కిషోర్, ముప్పనాపల్లి వెంకటేశ్వరరావు, నిడదవోలు రామారావు, రోటరీ అధ్యక్షుడు విశ్వనాథశాస్త్రి, తపన ఆరేటి ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: తన పట్ల అసభ్యకరంగా ప్రవర్తించి దౌర్జన్యం చేశాడని ఒక వ్యక్తిపై మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రిలో యర్రమాల కరుణ కుమారి ఆయాగా పనిచేస్తుంది. ఆసుపత్రిలో డయాలసిస్ యూనిట్ ఇన్‌చార్జ్‌గా పనిచేస్తున్న సుధాకర్ కరుణకుమారిని అసభ్యకరంగా తిడుతూ, దురుసుగా వ్యవహరించాడన్నారు. జుట్టు పట్టుకుని చంపుతానని బెదిరించాడని.. కరుణ కుమారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పంట ధ్వంసంపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: పొలంలోకి అక్రమంగా ప్రవేశించి, చెరుకు పంటను ధ్వంసం చేసినట్లు బాధితుడు నిజాపరపు దుర్గారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం చిన్నవారిగూడెంకు చెందిన నిజాపరపు దుర్గారావుకు గ్రామంలో పొలం ఉంది. పొలంలో చెరుకు వేయగా, అదే గ్రామానికి చెందిన తిరుమలశెట్టి చిన్న నాగేశ్వరరావు, రాంబాబు, తిరుమలశెట్టి ప్రసాద్‌లు పొలంలోకి దౌర్జన్యంగా ప్రవేశించి ట్రాక్టర్‌తో చెరుకు పంటను దున్నివేశారన్నారు. విషయం తెలుసుకున్న దుర్గారావు పొలం వద్దకు వెళ్లగా ట్రాక్టర్ నీ మీదకు ఎక్కించి వెళ్లిపోతామని బెదిరించారన్నారన్నారు. గతంలో కూడా ఇదేవిధంగా పొలంలోకి ప్రవేశించి కలుపు మందు కొట్టి పంటను నాశనం చేశారన్నారు. దుర్గారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.